క్లుప్తంగా

ఎస్సైకు సత్కారం



ఎస్సై అజయ్ బాబును సత్కరిస్తున్న ఆటో వర్కర్స్ యూనియన్

సంతనూతలపాడు: నూతనంగా నియమితులైన సబ్ ఇన్‌స్పెక్టర్ వేజెండ్ల అజయ్ బాబును ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. ఆటో వర్కర్స్ సమస్యలను ఎస్సై అజయ్ బాబుకు వివరించారు. కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కె. ప్రసాద్, ఉపాధ్యక్షుడు టి. మెస్సయ్య, ఎంపీటీసీ ఎస్కే రంతుల్లా, ఆటో వర్కర్ సీనియర్ నాయకులు షరీఫ్, రమణారెడ్డి, రాఘవ, అశోక్, శీను పాల్గొన్నారు.

పేకాట జూదరుల అరెస్ట్

మద్దిపాడు: మండలంలోని లింగంగుంట గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని ఎస్ఐ శివరామయ్య అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం సిబ్బందితో కలిసి పేకాట శిబిరంపై దాడి చేసి వారి వద్ద 5570 రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరు పరచనున్నట్లు స్టేషన్ సిబ్బంది తెలిపారు. మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారి వివరాలు తెలియజేయాలని ఎస్ఐ కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

నాగులుప్పలపాడు: పల్లె పండుగ కార్యక్రమం ద్వారా మండలంలో సుమారు రూ.4 కోట్లకు పైగా నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు శాసనసభ్యుడు బీఎన్ విజయ్ కుమార్ తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని నాగులుప్పలపాడు, చవలపాలెం, అమ్మనబ్రోలు గ్రామాలో సీసీ రోడ్లకు ఎమ్మెల్యే విజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో మహాలక్ష్మి, టీడీపీ నేతలు కాకార్ల లక్ష్మీ వరప్రసాద్, మనోజ్, వీరయ్య పాల్గొన్నారు.

ఘనంగా సంకటహర చతుర్థి పూజలు



ప్రత్యేక అలంకరణలో కార్యసిద్ధి గణపతి

ఒంగోలు మెట్రో: మహాగణపతి ప్రీతికరమైన సంకటహర చతుర్థి పూజలు ఆదివారం నిర్వహించారు. ఆదివారం స్థానిక రాజాపానగల రోడ్ లోని లక్ష్మీ గణపతికి, అద్దంకి బస్టాండ్ దగ్గర విఘ్నేశ్వర స్వామికి, ఒంగోలు బైపాస్ ఫ్లై ఓవర్ దగ్గర మహాగణపతికి అభిషేకాలు చేశారు.

జయప్రకాశ్ కాలనీలో గుంతలు పూడ్చాలి

ఒంగోలు టౌన్: నగరంలోని 50వ డివిజన్ జయప్రకాష్ కాలనీ ఎక్స్‌టెన్షన్‌లోని రోడ్డుకు అడుగడుగునా గుంతలు పడిపోవడంతో ప్రజలు నానా ఇక్కట్లు పడుతున్నారని, కార్పొరేషన్ అధికారులు వెంటనే గుంతలు పూడ్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సీపీఎం శాఖ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా ఆ పార్టీ నగర కార్యదర్శి జి. రమేష్ మాట్లాడుతూ.. కాలనీ ప్రజలు నడవడానికి కూడా ఇబ్బంది పడుతున్నారని, వరసగా వర్షాలు కురవడంతో గుంటల్లో నీరు నిలిచిపోయిందన్నారు. కాలనీలోని ప్రజలలో అత్యధికులు కూలి పనులు చేసుకొని జీవించేవారే ఉన్నారని, ఏ మాత్రం ఇబ్బంది కలిగిన భరించగలిగే స్థితిలో లేరని చెప్పారు. అధికారులు వెంటనే రోడ్డు మీది గుంటలు పూడ్చాలని కోరారు. కాలనీకి చెందిన బాబు, సురేఖ, నవమ్మ, లీలమ్మ, మోహనరావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అడుగుజాడల్లో పయనిద్దాం

ఒంగోలు టౌన్: అంటరానితనం వంటి రాకసిని ఎదిరించి నిలబడి చదువు దీపం వెలుగులో ప్రపంచ మేధావిగా ఎదిగిన బాబాసాహెబ్ అంబేడ్కర్ జీవితాన్ని నేటి తరం విద్యార్థులు అధ్యయనం చేయాలని, ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని ఉపాధ్యాయుడు జాలాది మోహన్ చెప్పారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం జరిగిన చదవడం మాకిష్టం కార్యక్రమంలో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్, అబ్రహం లింకన్, సోక్రటీస్ జీవిత చరిత్రలను బోధించారు. గొప్ప వ్యక్తుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని దేశభక్తిని అలవరుచుకోవాలని చెప్పారు. క్రీడలల్లోనూ చిన్నారులు రాణించాలని జిల్లా గ్రంథాలయ ఉప పాలకురాలు బొమ్మల కోటేశ్వరి సూచించారు. విద్య ఒక్కటే మనిషికి సంపూర్ణ వ్యక్తిత్వాన్ని ఇస్తుందని చెప్పారు. జ్ఞానం , నైపుణ్యం అనేవి అసాధ్యాన్ని సుసాధ్యం చేసే ఆయుధాలుగా పనికి వస్తాయని చెప్పారు. గ్రంథాలయ సిబ్బంది సంపూర్ణమ్మ, డి. సందీప్, దయామణి తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆశలపై నీళ్లు

- పెట్టుబడిసాయం కోసం పేద రైతులు ఎదురు చూపులు
- ఎన్నికల ముందు రూ.20 వేలు ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ
- నేటికీ ఖాతాల్లో పడని అన్నదాత సుఖీభవ నగదు
- జగన్ ప్రభుత్వంలో ఖరీఫ్‌కు ముందే రైతు భరోసా సొమ్ము జమ



నాట్లు వేయటానికి వరి నారు పీకుతున్న మహిళా కూలీలు

కొత్తపట్నం:

అందరికీ పట్టెడన్నం పెట్టే రైతు నేడు ఉసూరుమంటున్నాడు. పెట్టుబడి సాయం అందక అయోమయంలో పడ్డాడు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఖరీఫ్ పోయి రబీ వచ్చినా లాభం లేకుండా పోయింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఠంచనుగా రైతు భరోసా ఇచ్చింది. దాని పేరును అన్నదాత సుఖీభవగా మార్చిన కూటమి ప్రభుత్వం డబ్బు మాత్రం రైతుల ఖాతాల్లో వేయకుండా చోద్యం చూస్తోంది.

పెట్టుబడి ఎలా చేయాలో తెలియక చిన్న, సన్నకారు రైతులు అల్లాడుతున్నారు. రూ.20 వేలు ఇస్తామని కూటమి ప్రభుత్వం చేసిన ప్రకటన అలాగే ఉండిపోయింది. మండలంలో రబీకు గాను ప్రధాన పంటలైన వరి 2.2 వేల ఎకరాలు, వేరుశనగ 1000 ఎకరాలు, చామదుంప 400 ఎకరాలు, శనగ 2 వేల ఎకరాలు, కాయగూరలు, ఆకుకూరలు, పచ్చిమిర్చి, ఇతర ఉద్యాన పంటలు 3.2 వేల ఎకరాల్లో సాగు చేస్తారు. అయితే వీరంతా పేద రైతులే. ఒక్కోరు అర ఎకరా నుంచి 5 ఎకరాల్లోపే సాగుబడి చేస్తుంటారు. వీరికి ప్రభుత్వ సాయం కొండంత అండగా ఉంటుంది. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తన హయాంలోని ఐదేళ్లలో ప్రతి సంవత్సరం రూ.13,500 రైతులకు అందించింది. మండలంలోని 15 పంచాయతీల్లో 4,722 మంది రైతులకు నాటి సీఎం వైఎస్ జగన్ రూ. 6,37,47,000 నగదును జమ చేశారు. వీటితో రైతులు సకాలంలో పంటలు వేసి లాభాల ఆర్జించారు. కానీ నేడు ఖరీఫ్ ముగిసినా.. రబీ ఆరంభం అయినా అతీగతీ లేకుండా పోయింది. కూటమి తమ ప్రభుత్వం రాగానే రైతులకు పంట పెట్టుబడి కోసం రూ.20 వేలు ఇస్తామని టీడీపీ, జనసేన, బీజేపీలు ఎన్నికల ప్రచారం చేసి ఆ హామీ తుంగలో తొక్కాయి. ప్రస్తుతం రైతులు ప్రయివేటు వ్యక్తుల దగ్గర అధిక వడ్డీలకు తీసుకుని సాగు చేయాల్సిన దుస్థితి నెలకొంది. వర్షాలు పడి వరి నాట్లు వేయటానికి, వరి విత్తనాలు ఎద పెట్టడానికి సమయం వచ్చినా పెట్టుబడి లేకా చాలా మంది ఇంకా దుక్కులే దున్నలేదు.



వరి నాట్లు వేయటానికి దమ్ము చేస్తున్న ట్రాక్టర్

రబీలో అయినా ఇవ్వండి:



అదనులో నగదు ఇస్తే పెట్టుబడికి ఉపయోగ పడుతుంది. ప్రస్తుతం వర్షాలు పడి దుక్కులు దున్ని నాట్లు వేసుకుంటున్నాం. ఇంకా మా చేతుల్లో చిల్లిగవ్వ లేదు. గత ప్రభుత్వం అయితే సీజన్ రాకముందే రైతు భరోసా అకౌంట్‌లో వేసింది. మళ్లీ కష్టాలు వచ్చాయి.

తాతా నాంచార్లు: గమళ్లపాలెం

ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి:



కూటమి ప్రభుత్వం వస్తే పెట్టుబడి కింద ఏటా రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. రైతులంతా నమ్మి కూటమికి మద్దతు తెలిపారు. కానీ ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు కావస్తున్నా ఇవ్వలేదు.

గుడి నాగిరెడ్డి: పాదర్తి

ద్వారం మురళి: రంగాయపాలెం



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదు సంవత్సరాలు ఎలాగా సాయం చేసిందో.. నేటి ప్రభుత్వం కూడా అలాగే చేయాలి. రైతులు నాట్లు వేస్తుంటే ఇంత వరకు పెట్టుబడి ఇవ్వలేదు. ఖరీఫ్ అయిపోయింది. రబీ కూడా ప్రారంభమయ్యింది.

ద్వారం మురళి: రంగాయపాలెం

జనావాసాల మధ్య దుర్గంధం







హౌసింగ్ బోర్డు కాలనీ, బ్యాంకు కాలనీల్లో నివాసాల మధ్య మురుగు, వర్షపు నీటి నిల్వలు

- హౌసింగ్ బోర్డు కాలనీ, బ్యాంకు కాలనీల్లో పలు చోట్ల మురుగు నీరు
- ఇళ్ల మధ్యలో ఉండటంతో పెరిగిన దోమలు
- పట్టించుకోని నగరపాలక అధికారులు

ఒంగోలు అర్బన్: జిల్లా కేంద్రం ఒంగోలులోని పలు ప్రాంతాల్లో ఇళ్ల మధ్యనే మురుగు నీటి నిల్వలు దర్శనమిస్తున్నాయి. హౌసింగ్ బోర్డు కాలనీ, బ్యాంకు కాలనీల్లో ఇళ్ల మధ్యనే మురుగు నీరు చేరిరంది. దానికి తోడు ఇటీవల కురుసిన వర్షాలకు ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాలు, సైడు కాలువల్లో నీరు ఎక్కువగా చేరి రోడ్లపైకి వస్తోంది. దీంతో దోమల బెడద పెరిగిపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం ఆగిపోయినా నగరపాలక సంస్థ అధికారులు మాత్రం ఇంత వరకు ఇళ్లమధ్య ఉన్న నీటిని తొలగించేలా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దోమల బెడదతో పాటు దుర్వాసన వస్తుండటంతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు. చిన్న పిల్లలను ఇళ్ల నుంచి బయటకు పంపిస్తే ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. ఇప్పటికైనా నగరపాలక అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుని ప్రజారోగాన్ని కాపాడాలని.. ఫాగింగ్ వంటి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ముప్పాళ్ళ వద్ద కొట్టుకుపోయిన బీటీ రోడ్డు



మాచవరం వద్ద కొట్టుకుపోయిన రోడ్డు

తుఫాన్ మిగిల్చిన కడ‘గండ్లు’



ఉప్పుగుండూరు పొలాల్లో గండి పడిన కొత్తకాలువ



ఈదుమూడి వద్ద

నాగులుప్పలపాడు: ఇటీవల తుఫాను నేపథ్యంలో కురిసిన భారీ వర్షాలకు చాలా మేరకు పొలాలు నీట మునిగి పంట నష్టం జరిగింది. దీనికి తోడు నీటి ప్రవాహ తీవ్రత వల్ల మండలంలోని చాలా చోట్ల రహదారులకు గండ్లు పడి తీవ్రంగా నష్టపరచాయి. ముప్పాళ్ళ గ్రామం వెళ్ళే మూల మలుపు వద్ద బీటీ రోడ్డు కొట్టుకుపోయింది. ఉప్పుగుండూరు గ్రామం వద్ద కొత్త కాలువ కట్టకు గండి పడి నీరంతా పొలాల మీదకు వెళ్ళడంతో నారుమడులు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈదుమూడి గ్రామం వద్ద రోడ్డు మార్జిన్ లోతుగా కోతకు గురయ్యి వాహనదారులకు తీవ్ర ప్రమాదంగా మారింది. మాచవరం గ్రామం వద్ద రోడ్డుకు కోతకు గురవడంతో మాచవరం- ఉప్పుగుండూరు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోవడంతో పాటు అటు వైపుగా పొలాలు ఉన్న రైతులకు చేల వద్దకు వెళ్ళడానికి కూడా ఆటంకం ఏర్పడింది.

త్రిమూర్తి స్వరూపిణిగా అల్లూరి పోలేరమ్మ

మార్కాపురం టౌన్: స్థానిక అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి స్వరూపిణిగా ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని పుట్ట, నాగ శిలలను భక్తులు పూజించారు. పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ ఈఓ, చైర్మన్, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



త్రిమూర్తి స్వరూపిణిగా దర్శనమిస్తున్న పోలేరమ్మ తల్లి

వల నిండా పడాలి చేపలు!



పులివాగులో చేపలు పడుతున్న గుంతపల్లె వాసులు

కొమరోలు : ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు కొమరోలు మండలంలో వాగులు పొంగి పొర్లుతున్నాయి. మండలంలోని గుంతపల్లె గ్రామం సమీపంలో కల్వర్టు కింద పులివాగు ప్రవహిస్తుండటంతో స్థానికులు వలలతో చేపలవేట సాగిస్తున్నారు.

అబ్దుల్‌కలాం అవార్డు అందజేత



రఘుప్రదీప్‌కు అవార్డు అందజేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఎమ్మెల్యే నజీర్ అహ్మద్

ఒంగోలు సిటీ: డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా పురస్కారాన్ని కరవదిలోని వివేకానంద విద్యావిహార్ కరస్పాండెంట్ ఎస్‌వీఎస్ రఘుప్రదీప్ అందుకున్నారు. గుంటూరు ఏసీ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే నజీర్ అహ్మద్, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఆయనకు అందించారు. గత 30 సంవత్సరాలుగా సైన్స్ ఉపాధ్యాయుడిగా సేవలు అందిస్తున్నారు. అలాగే ప్రతి ఏడాది జాతీయ సైన్స్ దినోత్సవాన్ని గ్రామీణ ప్రాంతంలో విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు గాను ఈ అవార్డు లభించింది. కార్యక్రమంలో మలినేని గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ చైర్మన్ మలినేని పెరుమాళ్, గుంటూరు ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మోజెస్, గుంటూరు లా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అమృతవర్షిణి, నాగార్జున విశ్వవిద్యాలయ బోర్డు సభ్యులు డాక్టర్ వి.కన్నామాస్టర్, రాష్ట్ర జాయింట్ ట్రెజరర్ వెంకటేశ్వరరావు, అప్సా స్టేట్ కో చైర్మన్ మేకల రవీంద్రబాబు, ఎస్‌పీఎస్‌టీఓ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నాగయ్య పాల్గొన్నారు.

షిరిడీ సాయిపై తప్పుడు ప్రచారం తగదు



సమావేశంలో సాయిబాబా మందిరాల నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: కొందరు పనిగట్టుకొని శిరిడి సాయిబాబాపై అసత్య ఆరోపణలు, దుష్ప్రచారాలు చేస్తూ భక్తుల మనోభావాలను గాయపరుస్తున్నారని జిల్లా బాబా మందిరాల అధ్యక్షుడు అళహరి చెంచలరావు అన్నారు. ఆయన అధ్యక్షతన ప్రకాశం జిల్లా షిరిడీ సాయిబాబా మందిర సంఘాల ఆధ్వర్యంలో ఒంగోలు సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. మందిరాల అవసరాలు, సమస్యలపై చర్చించారు. సేవా కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించాలని, ఎస్పీ ఏఆర్ దామోదర్ వారిని కలిసి ఫిర్యాదు చేయాలని సమావేశంలో తీర్మానించారు. బాబాపై అసత్య ఆరోపణలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలుని హరిహరరావు, కోశాధికారి దేవకీ సుబ్రహ్మణ్యం తెలిపారు.

వాసవి క్లబ్ సేవలు ప్రశంసనీయం



అల్పాహారాన్ని అందిస్తున్న వాసవి క్లబ్ సభ్యులు

ఒంగోలు మెట్రో: సామాజిక సేవా రంగంలో వాసవి క్లబ్స్ అత్యున్నతమైన ప్రమాణాలు పాటిస్తూ, కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వాసవి క్లబ్ ఒంగోలు అధ్యక్షుడు నల్లమల్లి బద్రీ నారాయణ తెలిపారు. వాసవి జిల్లా 205 గవర్నర్ పేర్ల వెంకట సత్యనారాయణ జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం వాసవి క్లబ్ ఒంగోలు అధ్యక్షుడు నల్లమల్లి బదరి నారాయణ ఆధ్వర్యంలో నగరంలో యాచకులకు, అనాథలకు అల్పాహారాన్ని పంపిణీ చేశారు. పప్పు బజార్‌లోని రామ మందిరానికి కుర్చీలను బహూకరించారు. 2024 సంవత్సరం వాసవి క్లబ్స్ అంతర్జాతీయ అధ్యక్షుడు ఆర్. రవిచంద్రన్ నిర్దేశించిన కార్యక్రమాలను, అంతర్జాతీయ కోశాధికారి శిద్దా సూర్యప్రకాశరావు స్ఫూర్తితో నిర్వహిస్తున్నామని తెలిపారు. పబ్బిశెట్టి వినోద్ కుమార్, దరిశి చంద్రశేఖర్, పబ్బిశెట్టి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

290 మందికి వైద్య పరీక్షలు



మెగా వైద్య శిబిరంలో పాల్గొన్న తహసీల్దార్ ఆదిలక్ష్మి

సంతనూతలపాడు: మండలం గంగవరం హనుమంతరావు హై స్కూల్లో ఆదివారం జరిగిన ఉచిత మెగా వైద్య శిబిరంలో 290 మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. తానా సహకారంతో సేవా సంకల్పం చారిటబుల్ ట్రస్ట్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కిమ్స్ మల్టీ సూపర్ స్పెషాలిటీ, గుంటూరు శంకర్ నేత్రాలయ హాస్పిటల్, హెచ్‌సీజీ ఎంఎస్‌ఆర్ క్యాన్సర్ హాస్పిటల్ వైద్య బృందం సేవలు అందించారు. సేవా సంకల్పం చారిటబుల్ ట్రస్ట్, మండల సొసైటీ చైర్మన్ శనగల వెంకటరమణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి, హై స్కూల్ కరస్పాండెంట్ హనుమంతరావు,ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ వైద్యులు జగదీశ్వర్ రెడ్డి, సన్నిత వెంకటేశ్వర రెడ్డి, వేద వ్యాస్, గుంటూరు జిల్లా పెదకాకానిలో గల శంకర్ కంటి హాస్పిటల్ వైద్యులు దీక్ష ద్యుతిజాలు, క్యాన్సర్ హాస్పిటల్ వైద్యులు ఆర్వి రఘునందన్ పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

బేస్తవారిపేట: స్థానిక పంచాయతీలో సీసీ రోడ్ల నిర్మాణానికి గిద్దలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.93 లక్షలతో నిర్మించనున్న రోడ్లకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, జెడ్పీటీసీ బీవీ రాజయ్య, తహసీల్దార్ జితేంద్రకుమార్, ఎంపీడీఓ రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం ఏచూరి పోరాటం



సీతారాం ఏచూరికి నివాళులర్పిస్తున్న నాయకులు

తర్లుపాడు: మతతత్వ రాజకీయాలపై కమ్యూనిస్టు నేత సీతారాం ఏచూరి రాజీలేని పోరాటం చేశారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బాలనాగయ్య పేర్కొన్నారు. ఆదివారం స్థానిక స్త్రీశక్తి భవనంలో రైతు సంఘం ఆధ్వర్యంలో సీపీఎం అఖిల భారత మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి ఘన నివాళులు అర్పించారు. రాజ్యసభ సభ్యునిగా, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యునిగా, ఆర్థికవేత్తగా ఏచూరి దేశానికి సేవలందించారని కొనియాడారు. సీతారాం ఏచూరిని నేటితరం యువతకు ఆదర్శనీయమన్నారు. రైతు సంఘం కార్యదర్శి పాపిరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు అక్బర్ అలీ, నెహ్రూ యూత్ అధ్యక్షులు పుల్లయ్య, నేవీ రిటైర్డు ఉద్యోగి ప్రసాద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.